క్లుప్తంగా

బొండా ట్రస్ట్ సేవలు అభినందనీయం



రావు వెంకట కుమార్ మహీపతిని సత్కరిస్తున్న దృశ్యం

కరప: ట్రస్ట్‌ఆఫ్ బొండా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు చేస్తున్న సేవలు అభినందనీయమని పిఠాపురం రాజా వారసుడు రావు వెంకట కుమార్ మహీపతి రామరత్నరావు పేర్కొన్నారు. మండలం వేళంగి శ్రీనివాసా నర్సింగ్ హోమ్‌లో శనివారం జరిగిన ట్రస్ట్ ఆఫ్ బొండా అర్ధ సంవత్సర సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకన్నారావు మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ట్రస్ట్ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా 400 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. కాకినాడ డాల్ఫిన్ హోటల్ అధినేత బదిరెడ్డి వెంకన్న అన్న వితరణ చేశారు. అనంతరం రావు వెంకటకుమార్ మహీపతి రామరత్నరావును ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ వీవీ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, డాల్ఫిన్ అధినేత బదిరెడ్డి వెంకన్న, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ కార్యాలయం వద్ద కృత్రిమ పరికరాలు పంపిణీ చేశారు. కేజీ బేసిన్ ప్రాజెక్టు, ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ అంజన్ జ్యోతి పుఖాన్ ముఖ్య అతిథిగా హాజరై విభిన్న ప్రతిభావంతుల అవసరాలను గుర్తించి ఎన్నో పునరావాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గోదావరి మహిళల క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అందజేశారు. సంస్థ ఈడీ ఎస్‌పి రెడ్డి, ఆయిల్ ఇండియా లిమిటెడ్ సిబ్బంది, జీఎం ఎస్‌కే బిస్వాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో ఆధునిక పద్ధతులు వినియోగించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సివిల్ ఇంజినీర్లు ఆధునిక సాంకేతిక విధానాలతో ముందుకు సాగాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకేలో శనివారం సివిల్ ఇంజినీరింగ్, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ, కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో మట్టిని తిరిగి సారవంతం చేసే అంశంపై సదస్సు నిర్వహించారు. ఐఐటీ మద్రాస్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రాజగోపాల్, ఆర్‌అండ్‌బీ డీఈఈ సుబ్రమ్మణ్యం మాట్లాడుతూ ఎత్తయిన రిటైనింగ్ గోడల నిర్మాణం, కరకట్టల నిర్మాణానికి జియో సింథటిక్స్ వాడకం, కరకట్టల నిర్మాణానికి తీసుకోవలసిన ఆచరణాత్మకమైన అంశాలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ చాప్టర్ చైర్మన్ బాదం సుందర రావు, డైరెక్టర్ వి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రపంచ యోగా పోటీలకు నగర క్రీడాకారులు



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

కాకినాడ సిటీ: ఈనెల 16న ఢిల్లీలో జరిగే ప్రపంచ కప్ యోగాసన పోటీలకు నగరానికి చెందిన యోగా క్రీడాకారులు బొజ్జ లక్ష్మి, గంపల లహరి దుర్గ, కంబాల భాస్కర్ సాయిరాం ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, యోగా గురువు చిట్టూరి చిట్టిబాబు శనివారం సాయంత్రం తెలిపారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కాకినాడలోని ఆమె స్వగృహంలో వారిని అభినందించారు. యోగా కోచ్ డి.దుర్గాకాంతప్రసాద్, మహ్మద్ యాసిన్ పాల్గొన్నారు.

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు



దూడ దుర్గా ప్రసాద్(ఫైల్)

కాకినాడ రూరల్: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన దుమ్ములపేటకు చెందిన మత్స్యకారుడు దూడ దుర్గాప్రసాద్ (27) గల్లంతవ్వడంతో సర్పవరం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఫైబర్ బోటులో వేటకు వెళ్లిన వారిలో దుర్గా ప్రసాద్ కనిపించకపోవడంతో తోటి మత్స్యకారులు కంగారు పడ్డారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఒడ్డుకు చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గతనెల 28న చేపల వేటకు వెళ్లిన తొమ్మిది మందిలో ఒకరు గల్లంతు కావడంతో మత్స్యకారులు విషాదంలో మునిగిపోయారు. రాత్రిపూట చేపల వేట సాగించి పగటిపూట ఉదయం భోజనం అనంతరం బోటు లంగరు వేసి వారు నిద్రలోకి జారుకున్నారు. నిద్ర లేచి చూస్తే దుర్గా ప్రసాద్ కనిపించలేదు. దుర్గా ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బోధన ప్రయోగాత్మకం

- నర్సింగ్‌లో సరికొత్త ఒరవడి
- గ్రహణ సామర్థ్యం పెంపే లక్ష్యంగా రంగరాయలో ప్రాక్టికల్స్



ప్రాక్టికల్స్‌లో కౌన్సెలింగ్ నిర్వహణను తిలకిస్తున్న రాష్ట్ర డీఎంఈ డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: సాధారణంగా మమ అంటూ నిర్వహించే ప్రాక్టికల్ తరగతులకు రంగరాయ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు సరికొత్త రూపునిచ్చారు. కళాశాల చరిత్రలో తొలిసారి ప్రాక్టికల్స్ నిర్వహించారు. సాధారణ తరగతులను సైన్స్ ఎగ్జిబిషన్ స్థాయిలో సకల హంగులతో నిర్వహించి ప్రదర్శనకు పెట్టారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మునిరత్నమ్మ ఈ వినూత్న ప్రాక్టికల్స్‌కి అంకురార్పణ చేసి మన్ననలు పొందారు.

ఇలా ఎందుకంటే

వేషధారణ నుంచి మాటతీరు, విషయావగాహన వరకు ప్రతి అంశాలోనూ విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో పాల్గొన్నారని థర్డ్ ఇయర్ హెచ్‌వోడీ ఉమాసుందరి తెలిపారు. ప్రిన్సిపాల్ మార్గనిర్దేశంలో సెకండియర్ హెచ్‌వోడీ ఎం.పద్మకుమారి, బోధకుల బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రయోగాలకు తెరతీశారు.

ఇవీ ప్రదర్శనలు

ఈ ప్రదర్శనల్లో మాస్ మీడియా, లీఫ్ లెట్, పాంప్లెట్స్, ప్రాజెక్టెడ్, నాన్ ప్రాజెక్టెడ్, త్రీడీ, ప్రింటెడ్, హ్యాండ్ మేడ్, గ్రాఫిక్ ఎయిడ్లు, సీపీఆర్, పొల్యూషన్, హైపర్‌గ్లైసీమియా, స్మోక్, ఫ్లానెల్ బోర్డ్, నర్సెస్ అల్ఫాబెట్స్, ఇంటర్నేషనల్ నర్సెస్ డే, నిమోనియా, కార్డియోజెనిక్, లంగ్స్, హార్ట్,లివర్, షాడో పప్పెట్స్, ఫింగర్, స్ట్రింగ్, స్టిక్ పప్పెట్లు, ఎక్యూట్ మెడికల్ కేర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాలు ఆకట్టుకున్నాయి.

సంప్రదాయాలకు పెద్దపీట

శాస్త్రీయతే హృదయమైనా సంప్రదాయాల ప్రదర్శనకు ప్రాధాన్యం ఇచ్చారు. దండోరా వేసి ఆహూతులకు అక్కడి ప్రదర్శనల ప్రాధాన్యాన్ని వివరించారు, ఈ వేష ధారణ, ప్రదర్శనలో నర్సింగ్ విద్యార్థిని కీర్తన తనదైన ముద్ర వేసింది. అలాగే హరిదాసుగా పూజ, వృక్షో రక్షతి రక్షితః నినాదంతో భార్గవి బృందం ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆంగ్లంలో అదరగొట్టారు

విద్యార్థుల ప్రదర్శనలకు అదనపు వారి ఆంగ్ల భాషా ప్రావీణ్యం. బీఎస్‌సీ నర్సింగ్ రెండో ఏడాది చదువుతున్న వీరంతా ఆయా ప్రదర్శన విశిష్టతలను ఆంగ్లంలో వివరిస్తూ ఆకట్టుకుంటున్నారు. శనివారం రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి ప్రదర్శనను తిలకించి విద్యార్థులను, ప్రిన్సిపల్, బోధనా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



వృక్షం ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రాక్టికల్స్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నాటిక

నర్సింగ్ బోధనలో కీలక ముందడుగు



విద్యార్థుల్లో విషయావగాహనను పెంపొందించడానికి కీలక ముందడుగు వేశాం. ఇది నర్సింగ్ బోధనలో ప్రధానమైనది. బోధనా సిబ్బంది ఎంతగానో సహకరించారు. కమ్యూనికేషన్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ పేరుతో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ నూరు శాతం ఫలవంతం కావాలని నిర్ణయించాం. 50 మంది విద్యార్థులతో ఆ దిశగానే అడుగులు వేసి తగిన ఫలితాలు రాబట్టాం. ఈ ప్రాక్టికల్స్ నాలుగు రోజులుగా సాగుతున్నాయి.

– డాక్టర్ ఎం.మునిరత్నమ్మ, ప్రిన్సిపాల్, రంగరాయ నర్సింగ్ కళాశాల

మరో రెండు రోజులు..



నర్సింగ్ బోధనలో ఇదో విప్లవాత్మక మార్పు. ఈ తరహా ప్రాక్టికల్స్ రాష్ట్రంలోనే తొలిసారి. అంకురార్పణ చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ మునిరత్నమ్మ సహ బోధకులకు అభినందనలు. శనివారంతో ప్రాక్టికల్స్ పూర్తి అయినా మరో రెండు రోజులు కొనసాగించాలని కోరాం.

– డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ), విజయవాడ

అదనపు పోషకాహారం పంపిణీ



అదనపు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: స్థానిక సాంబమూర్తినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు పోషకాహార పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ కృతికా శుక్లా శనివారం ప్రారంభించారు. ఆరోగ్య బాలలతో ఆరోగ్య సమాజాన్ని చూడగలమని ఆమె అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ఎస్‌పీఎంసీఐఎల్ కంపెనీ జిల్లాలోని లోప పోషణతో ఉన్న బాలలకు అదనపు అనుబంధ పోషకాహారం అందించడానికి ముందుకు రావడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో పోషణా లోపంతో ఉన్న 3750 మంది చిన్నారులకు ఈ సంస్థ ఆర్థిక సాయంతో నెయ్యి, మిల్లెట్ చిక్కీలు అందిస్తారన్నారు. ఎస్‌పీఎంసీఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంస్థ కేంద్రప్రభుత్వ ఆధీనంలో నడుస్తోందన్నారు. కంపెనీ ప్రతినిధులు ఎ.దుర్గాప్రసాద్, హెచ్‌ఆర్ జీఎం సిద్ధార్థ మన్నవ, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, సీడీపీవో కె.దయామణి తదితరులు పాల్గొన్నారు.

నానాజీ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ నేతలు నాగమణి, చందు



సమావేశంలో మాట్లాడుతున్న జమ్మలమడక నాగమణి, మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న చందు, సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు

కాకినాడ రూరల్: యువగళం సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కన్నబాబులపై అసభ్యంగా మాట్లాడిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన నాయకుడు పంతం నానాజీ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. రమణయ్యపేటలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో అధికార పార్టీ నాయకులను తిట్టడమే పనిగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఎమ్మెల్యే కన్నబాబుపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. పంతం నానాజీ నోటికి ఎంతవస్తే అంత అన్నట్టు మాట్లాడుతున్నారని, అది సరైన పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలో కన్నబాబు హయాంలో జరిగిన అభివృద్ధి తెలుసుకుని మాట్లాడాలన్నారు. పార్టీ మహిళా నాయకులు భువనేశ్వరి, నల్లా రాణి, దైవకృప పాల్గొన్నారు.

వ్యాఖ్యలు అభ్యంతరకరం

కాకినాడ రూరల్: యువగళం బహిరంగ సభలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంతం నానాజీ తమ నాయకుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ నేత పుల్ల చందు పేర్కొన్నారు. తన కార్యాలయం వద్ద సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీను, భావనారాయణ స్వామి ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, వార్డు సభ్యుడు చక్రధర్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు డేవిడ్ లివింగ్ స్టన్, తదితరులతో కలిసి శనివారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. రెండు సార్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన కన్నబాబును ఉద్దేశించి శుక్రవారం పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలను నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. జనసేన ఆవిర్భవించినప్పటి నుంచి వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యక్తిగత లబ్ధి కోసం ఎమ్మెల్యే కన్నబాబును టార్గెట్ చేస్తూ గతంలో కూడా దూషించారన్నారు. కన్నబాబు వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులకు ఎంతో లబ్ధిచేశారన్నారు. సన్యాసులు అనే పదం ఎంత వరకు సమంజసమని చందు ప్రశ్నించారు. కన్నబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని గ్రామాల్లోకి వెళ్లి చూడాలన్నారు. జనసేన, టీడీపీలు కలిసి పోటీ చేసినా సీఎంగా జగన్ అవుతారని, ఎమ్మెల్యేగా కన్నబాబు అవుతారన్నారు. నానాజీ ఇకపై అభ్యంతరకరమైన భాష మాట్లాడితే సహించేది లేదని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు.

తుపాను హెచ్చరికలతో అప్రమత్తం

- అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- కమిషనర్ నాగనరసింహారావు ఆదేశం

కాకినాడ: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వివిధ విభాగాధిపతులు, ప్రత్యేకాధికారులతో ఈ అంశంపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న ఒకటి రెండు రోజుల్లో ఈదురుగాలులు, భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఆయా డివిజన్లకు చెందిన ప్రత్యేకాధికారులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు పడడం వంటి సంఘటనలు ఎదురైతే తక్షణమే సమస్య పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న డివిజన్లలో ముంపునకు గురికావడం, వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురైతే సామాజిక భవనాలు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కార్పొరేషన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అక్కడ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మనే కృష్ణమోహన్, ఏవో శిరీష్, ఈఈలు మాధవి, వెంకటరావు, డీఈలు, ఏఈలు, వివిధ విభాగాధిపతులు సమావేశంలో పాల్గొన్నారు.

రైతులు పంటను జాగ్రత్త చేసుకోవాలి

- తహసీల్దార్ శ్రీనివాసరావు



వేములవాడలో ధాన్యం తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

కరప: తుపాను హెచ్చరికల నేపథ్యంలో పంటను దక్కించుకోవడానికి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పేపకాయల మాచిరాజు తదితరులతో కలసి పలు గ్రామాల్లో పర్యటించి, రైతులకు సూచనలిచ్చారు. మాసూళ్లచేసిన ధాన్యాన్ని రైతులు విక్రయించాలన్నారు. పల్లపుప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని మెరకప్రాంతాలకు చేర్చాలని, కోతలు కోసి పనపై ఉన్నచోట్ల వరిని పైకి తెచ్చుకోవాలని సూచించారు. తేమశాతం ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్‌బీకేల ద్వారా ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నామన్నారు. జీపీఎస్ లేని ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించుకోవచ్చన్నారు. రైతులు తమ గ్రామ సమీపంలోని రైస్ మిల్లులకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. ఆర్‌బీకేల వద్ద వీఏఏలను సంప్రదిస్తే అన్ని వివరాలు చెపుతారని తహసీల్దార్ తెలిపారు.

సామాన్యుడికి వరం వైఎస్సార్ బీమా

కాకినాడ సిటీ: వైఎస్సార్ బీమా సామాన్యుడి పాలిట వరమని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి శనివారం తెలిపారు. బీమా చేసుకున్నవారు దురదృష్టవశాత్తు మరణిస్తే రావాల్సిన పరిహారాన్ని వారం రోజుల్లోనే చెల్లిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఈ క్లెయిమ్ చెల్లింపులో ఆధునిక విధానాన్ని తీసుకువచ్చిందని, ఈ పద్ధతిలో బీమా కంపెనీల జాప్యానికి చెక్ పెట్టిందన్నారు. బీమా చేయించుకున్న వ్యక్తి మరణిస్తే ప్రభుత్వం 4 నుంచి 10 రోజుల్లో పరిహారాన్ని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంలో ఈ ఏడాది 1 జులై 2024 నుంచి 30 జూన్ 2024 వరకు సదుపాయం కల్పిస్తున్నారన్నారు. ఈ సంవత్సర కాలంలో ప్రమాదవశాత్తు 75 మంది మరణిస్తే అందులో 61 మందికి రూ.5 లక్షల చొప్పున రూ.3.05 కోట్లను 10 రోజుల్లో బాధిత కుటుంబాలకు నేరుగా నామినీ వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు చెల్లిస్తున్నట్లు పీడీ తెలిపారు.

బలరాముడిగా సీతారాముడు

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మరకత మణికంఠ శోభాయాత్ర

స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత మణికంఠ శోభాయాత్ర ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ శనివారం విలేకర్లకు తెలిపారు. స్థానిక రామారావుపేట, సుబ్బయ్యహోటల్‌వీధి మీదుగా శోభాయాత్ర జరుగుతుందన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి

- మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు
- ఆర్యవైశ్య విశ్రాంతి భవనం ప్రారంభం



విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాసరావు

కాకినాడ: ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉంటే అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించవచ్చునని దేవదాయశాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక వార్ఫురోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య మహాసభ కాకినాడ అర్బన్ జిల్లా విశ్రాంతి భవనం మొదటి అంతస్తును ఆయన శనివారం ప్రారంభించారు. మహాసభ కాకినాడ అధ్యక్షుడు బాదం మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెల్లంపల్లి మాట్లాడుతూ వైశ్య సామాజిక వర్గ పురోగతికి సీఎం జగన్ ఎల్లప్పుడు అండగా ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని, అదే సమయంలో ఆర్యవైశ్యులు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎస్పీ సతీష్‌కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది రత్నాజీ, గౌరవాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, ద్వారంపూడి ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) వైశ్య ప్రముఖులు సోముప్రసాద్, పి.కనకరాజు, విశ్రాంతి భవనం ప్రధాన దాత, ఆడిటర్ డీపీఆర్ స్వామి, ఇతర వైశ్యసంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వే నూరుశాతం పూర్తిచేయాలి

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు 5 నుంచి 18 ఏళ్లు కలిగిన విద్యార్థులకు సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వేను నూరుశాతం పూర్తి చేయాలని కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఈ అంశంపై సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో వలంటీర్ పరిధిలో ఇప్పటికే గుర్తించిన 5–18 ఏళ్ల పిల్లల వివరాలను సీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చదువు మానివేసిన, బడి బయట పిల్లలను గుర్తించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం సర్వే చేస్తోందన్నారు. ఇప్పటికే చాలా వరకు పూర్తిచేసినప్పటికీ సాంకేతిక పరమైన ఇబ్బందుల వల్ల పూర్తికాలేదని, సర్వేను నూరుశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాకినాడ అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

కాకినాడ సిటీ: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆదివారం విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలను కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 8 గంటలకు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.1.19 లక్షల విలువైన సరకు జప్తు

కాకినాడ సిటీ: పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో నమోదైన 6ఏ కేసుల విచారణలో సీజ్ చేసిన సరకులను ప్రభుత్వానికి జప్తు చేస్తూ జేసీ ఇలక్కియ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జప్తు చేసిన సరుకు విలువ రూ.84 వేలు, ఎండీయూ వాహన యజమానిపై రూ.25 వేలు, రైసు మిల్లు యజమానిపై రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని పౌర సరఫరాల శాఖ ఖాతాకు జమ చేయనున్నట్లు జేసీ వివరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో లయన్స్ క్లబ్ విజన్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ బి.శ్రీవాణి మాట్లాడుతూ చలికాలం కావడంతో చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు పేదలు, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు

కాకినాడ క్రైం: ఈ ఏడాది అక్టోబర్ 19న ఎన్‌హెచ్ఎం పరిధిలో ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు. 9 మంది నర్సులు, నలుగురు సపోర్టింగ్ స్టాఫ్‌కు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ శనివారం కాకినాడలోని ఆయన కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. వీరంతా జీజీహెచ్‌లో ఎస్ఎన్‌సీయూలో విధులు నిర్వర్తించనున్నారు.

దివ్యాంగులకు డిజిటల్ విద్యపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ సిటీ: రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం విజన్–2025లో భాగంగా ఇటీవల జిల్లాలోని దృష్టి, వినికిడి లోపం ఉన్న 250 మంది దివ్యాంగులకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబ్‌లను అందజేసినట్లు ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. శనివారం పీఆర్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు డిజిటల్ విద్యపై ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలకు ఒక రోజు శిక్షణను ఆమె ప్రారంభించారు. డిజిటల్ సాధనాల ద్వారా విద్యాబోధనపై సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసినట్లు తెలిపారు. వీటిలో సాఫ్ట్‌వేర్, 33 రకాల యాప్‌లను ఇందులో పొందుపరచినట్టు తెలిపారు. స్టేట్ ఐఈ కన్సల్టెంట్ డాక్టర్ నరసింహం, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, పీఆర్ కళాశాల ప్రిన్సిపల్ బీవీ తిరుపణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమించేందుకు క్రీడలు దోహదం



విజేతలైన కాకినాడ కబడ్డీ జట్టుకు పతకాలు అందజేస్తున్న నాయక్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఒత్తిడిని అధిగమించి ఉత్సాహంగా పనిచేయడానికి క్రీడలు దోహదపడతాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఏకే నాయక్ అన్నారు. శనివారం జిల్లా క్రీడామైదానంలో కాకినాడ డివిజన్ ఫారెస్ట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో రాజమంహేంద్రవరం సర్కిల్ ఫారెస్ట్ ఉద్యోగుల వార్షిక క్రీడలు ఘనంగా ముగిసాయి. నాయక్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, డీఎఫ్ఓ భరణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గౌరవ అతిథిగా డీఎస్ఏ డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ హాజరయ్యారు. నాయక్ విజేతలకు అభినందనలు తెలిపారు. డీఎఫ్ఓ భరణి మాట్లాడుతూ 200 ఉద్యోగులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. రంపచోడవరం డీఎఫ్ఓ జీజీ నరేంద్రన్, కాకినాడ సబ్ డీఎఫ్ఓ అనూష, అడ్డతీగల డీఎఫ్ఓ శ్రీరామారావు, రాఘవరావు, వరప్రసాద్, దుర్గారామ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–11, 14, 17, ఆధ్వర్యంలో శనివారం జిల్లా క్రీడామైదానంలో రోలర్‌స్కేటింగ్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. డీఎస్ఏ డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. ఆయా విభాగాల్లో 68 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రోడ్ విభాగంలో ఆదివారం ఉదయం అక్షరస్కూల్ ఎదురుగా గల రోడ్ నందు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఎంపికల్లో పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి నూకరాజు, శ్రీహరిరాజు, వాకలపూడి పీడీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.